ఆకాశవాణి పద్యపుష్పకం

సంపాదకులు :

శ్రీమతి వారణాసి సూర్యకుమారి

ప్రచురణ :

సాహితీ మిత్రులు, మచిలీపట్నం

ప్రచురణ సంఖ్య : 83

ప్రథమ ముద్రణ : **మే 2012**

వెల : **రూ. 25/-**

ప్రతులు : 500

డి.టి.పి. : ఎమ్. మురళీకృష్ణ

ప్రతులకు :

సాహితీ మిత్రులు,

20/151-1, మోనికా రెసిడెన్సీ

చిలకలపూడి, మచిలీపట్నం - 521 002.

ఫోన్ : 9247581825

ముద్రణ :

బందరు కళ్యాణి ప్రెస్

రామానాయుడుపేట

మచిలీపట్నం - 521 001.

ఫోన్ : 08672 - 223404

తెలుగు వెలుగు

తే.గీ. తెలుగు సంస్కృతి మనయిండ్ల తేలియాడి
తెలుగు భాషకు గుర్తింపు దేశమంత
కలిగినపుడు మన కనుల వెలుగు కనగ
తెలుగుతల్లికి మనసంత పులకరించు ॥

తెలుగుభాషాభివృద్ధికై అభిమానులు అనేక విధాల చేస్తున్న కృషి శ్లాఘనీయం. అట్టి మహత్తర భాషోద్యమంలో పాల్గొని ఉడతాభక్తిని తెలుగు భాషామతల్లిని సేవించే సదుద్దేశంతో మా 'సాహితీ మిత్రులు' అందరం పాటు పడుతున్నామని తెలియజేయటానికి ఈ చిన్నియత్నం.

'పద్యపుష్పకం' బయలుదేరిన తదుపరి లభించిన ప్రోత్సాహంతో మరో 'పద్య పుష్పకం' అందించే సాహసం చేశాము. ఇవి ఆకాశవాణిలో ప్రసారానికి నోచుకున్నవని సంతోషంగా తెలియజేసుకుంటున్నాను. అందుకే ఈ పద్యపుష్పకానికి 'ఆకాశవాణి పద్యపుష్పకం' అని పేరు పెట్టాము.

ఈ పొత్తం నిమిత్తం తీరికలేనివారు కూడా 'నేను సైతం' అంటూ కలం పట్టి కదంత్రొక్కి ఎంతో సహకరించారు. వారి తెలుగు భాషాభిమానానికి అభివాదాలు.

సాహితీ రథసారథియైన డా॥ రావి రంగారావు గారు 'సాహితీ మిత్రులు' వ్యవస్థాపక అధ్యక్షులకు ధన్యవాదాలు. వారి ప్రోత్సాహం లభించటం మా అదృష్టము.

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ' అన్నట్లుగా మా యీ ' ఆకాశవాణి పద్య పుష్పకం' 'అంకితం' చేయాలనే సంకల్పంతో తెలుగువాణిని ఆకాశవాణిలో ప్రత్యేక బాణిలో వినిపిస్తూ వెలుగులు విరజిమ్ముతున్న శ్రీ ఆదిత్యప్రసాద్ గారిని అర్థించగా మంగళగిరివారు సహృదయంతో మమ్మల్ని ప్రోత్సహించే సదుద్దేశంతో అంగీకరించి నందులకు వారికి సర్వదా కృతజ్ఞులం.

విజయవాడ 'ఆకాశవాణి' స్టేషను డైరెక్టరుగా తెలుగు భాషాభివృద్ధిపై అత్యంత శ్రద్ధాసక్తులతో ఆయన చేస్తున్న కృషి అనన్య సామాన్యం.

మూర్తీభవించిన సంగీత సాహిత్య సమ్మేళనం శ్రీ మంగళగిరి ఆదిత్య ప్రసాద్ గారు. వారికి మరొక్కమారు కృతజ్ఞతాభినందనలు.

వారణాసి సూర్యకుమారి

కవి సంచిక

తెలుగు భాష

సీ॥ తెలుగుభాష సుధను తెలివిగ గ్రోలుము
తెలుగువికాసమ్ము తెలుసుకొనుము
సీసపద్యము వాణి చిరుదరహాసమై
వాఙ్మయమ్మున గొప్పవరము నొప్పు
మత్తేభశార్దూల మత్తకోకిల వృత్త
ముల జూపుచుండును తెలుగుబాణి
చంపకోత్పలమాల! నింపును మధురిమ
కందమందించును విందు మనకు

తే.గీ. తేటగీతి యాటవెలది ద్విపదలన్ని
తెలుగుభాష తీయదనము తెలుపుచుండు
వెలుగు నిడునట్టి దివ్వెయె తెలుగుతల్లి
విలువ నెరిగిన సంస్కృతి నిలువగలదు ॥

సీ॥ తెలుగు పద్యముల యతియు ప్రాసనియమాలు
కవితామతల్లికి కాన్కలగును
భాష సౌందర్యమున్ పదములొక్కటియైన
ప్రతిపదార్థము వేరుపలుకు తెలుగు
గద్యమైన తెలుగు పద్యమైనను భావ
పరిమళము నిలుచు మనసునందు
మాతృభాషయెడల మన్నన యున్నచో
చెలిమియు, బలిమియు, కలిమియగును ॥

తే.గీ. మంచి రచనలు మాతకు మల్లెవిరులు
భారతీదేవి నర్చించు భాగ్యమంది
వివిధ ప్రక్రియల్ చేబట్టి విధిగవ్రాసి
సాహితీసేవ జేయుటె సార్థకమ్ము ॥

సీ॥ దేశభాషలందు తెలుగు లెస్సయనిరి
రాయలా యుగమునె రాజసముగ
ఆముక్తమాల్యద నాంధ్రమున్ రచియించి
తెలుగుపై మమతను తెలిపిరపుడె
తేనెలూరెడు భాష తెలుగుభాషని చెప్పి
పంచశతాబ్దులు పరుగుదీసె
ప్రాచీనభాషగా ప్రబలమౌ గుర్తింపు
లభియించుట మనకు లక్ష్యమయ్యె!

తే.గీ. తల్లిదండ్రులు నేర్పిన పిల్లలంత
తెలుగుభాషాభిమానులై నిలువగలరు
ఎల్లలను దాటివెళ్ళినన్ ఎదలనిండ
మాతృభాషను మన్నించ మరువలేరు ॥

తే.గీ. తేటి ఝుంకారమై యొప్పు తెలుగుగీతి
మధుర భావలహరిదేల్చు భాషతెలుగు
నలువరాణిగ కనులకాంతి తెలుగు వెలుగు
తెలుగు నేర్పిన కొలదిని తెలివి పెరుగు

సీ॥ ఆంధ్రసారస్వత మాద్యంతము చదువన్
అపురూపముగ తోచు అనుభవమ్ము
అద్భుతమైనట్టి యాగ్రంథరాజముల్
ఆచంద్రతారార్క మనగ నిలుచు
పదప్రయోగములు సమాసభూయిష్ఠమై
చదువరినిగెలువ సత్యమగును
ఆనాటి కవులంత ఆదర్శప్రాయులై
అవతరించి రచన లవధరించె

ఆ.వె. భక్త పోతనార్యు భాగవతమ్మును
విశ్వనాథ కల్పవృక్ష కథను
భారతమ్మును కవిత్రయమును వ్రాసిరి
ధరణిలోన వారు ధన్యులైరి.

సీ॥ శ్రీనాథకవిరాజు సీసపద్యపు సొంపు
భీమఖండాదుల ప్రీతిగొలుపు
ఆ పారిజాతాపహరణమ్ము గొరికించె [నొటికించె]
ముక్కుతిమ్మనకవి ముద్దుపలుకు
అలనాడు వ్రాసిన అలసాని పెద్దనన్
మనుచరిత్రను నేడు మరవగలమె?
వసుచరిత్రను వ్రాసి వసుధ పేరొందిన
భట్టుమూర్తి తలంపు భాగ్యముకద!

ఆ.వె. గ్రాంథికమును తెలుగుగ్రామీణ భాషను
రచన చదువ విలువ రయము తెలియు
ఏ విధమ్ము నెవ్వ రేమిచెప్పిన గాని
కవిహృదయము నిలుచు కనులముందు

సీ॥ తీయనిపాలలో తీయని నవనీత
తుల్యము తెలుగన్న దొరలు కలరు
రాయని వారిని 'రా' యని పిలిచియు
తెలుగు భాషనునేర్పు తెగువ తగును
కూయని కోయిల 'కూ' యని కూయగ
తెలుగునాడుముదమ్ము తేలియాడు

తే.గీ. తెలుగునాటను మనమంత తెలివికలిగి
పలుకవలె సుమ్ము ప్రతినోట తెలుగుమాట
పాడవలె తప్పక తెలుగుపాట మనము
తెలుగుతల్లికి జోహార్లు తెలుపుకొనుచు

సీ॥ పాఠశాలలోన బాగుగా గురువులు
తెలుగువైశిష్ట్యమున్ తెలుపదగును
'అమ్మ'! యన్నపలుకు కమ్మగ వినిపించు
'మమ్మీ!' యను పదము వమ్మె యగును
'నాన్న!' యన్న పిలుపు కన్న మిన్నయగునె
'డాడీ'! యనుట అది డాబుసరియె
పరభాషనేర్చినన్ ప్రతిభను పొందినన్
కోటివిద్యలు కావె కూటికొరకు?

తే.గీ. తెలుగువారంత దీక్షతో తీవ్రముగను
తెలుగుభాషకు ఘనతను తెచ్చిపెట్టి
తెలుగుజాతి గౌరవమును నిలిపినపుడె
తెలుగుతల్లి డెందమునందు తృప్తినొందు ॥

సీ॥ పంటలు పండించ ప్రవహించు నదివోలె
జ్ఞానప్రవాహంబె తాననంగ
ఫలపుష్పఛాయలన్ బదులడగకె నిడు
తరువైన చందమ్ము తపనపడుచు
విషయసేకరణలో విరులతేనియ గ్రోలు
మధుపమ్మువోలెను మధనపడుచు
ప్రజల మేలుకొరకు పాటుపడు మనసు
గలయట్టి నరులున్న కలుగు శుభము

ఆ.వె. సకల భావములకు సంగీత సాహిత్య
సంపదయె మనకిల సాధనమ్ము
వరము లిచ్చి సుంత వాగ్దేవి కృపజూప
సాధ్యమగును జయము జగతి మనకు

- వారణాసి సూర్యకుమారి, 9849319423

బందరు నాడు నేడు

సీ॥ శాతవాహన కీర్తి చంద్రిక జగతికి
పరిచయంబును చేసె బందరపుడు
పారశీకులకును పాలన కేంద్రమై
వరలె వ్యాపారాన బందరపుడు
చేనేత వస్త్రాల చేవను చూపించి
పరవశించెనుగాదె బందరపుడు
ఓడరేవుగగాదు ఓడలుచేయించి
పరువు పొందెనుగాదె బందరపుడు

కోనేరు సెంటరు కూడలిగానుండి
బాగుగ పెరిగెను బందరపుడు
పట్టాభి స్థాపించె బందరందున బ్యాంకు
ఆంధ్రుల గౌరవ మ్మతిశయింప
పింగళి చేసెను ప్రేమతో జెండాను
గాంధి మోదమ్ముతో ఘనత నందె
కోపల్లె నిలబట్టె కొత్త కళాశాల
జాతీయ భావాలు జగతి పంచ

కృష్ణపత్రిక ముట్నూరి కృష్ణరావు
స్వేచ్ఛ గీతాలు పాడించె సీమలోన
దేశభక్తుల నిలయమీ దివ్యభూమి
కవులు గాయకుల్ నటులకు గట్టిపట్టు

ఆ.వె. పాండురంగ విభుడు, 'పావని' పైడమ్మ
మహిమ చూపుచుండు మాకు నెపుడు
చిద్విలాసమూర్తి శివగంగవాసిని
శేస లిచ్చి బ్రోచు శివము గూర్చు.

- ముదిగొండ సీతారావమ్మ, 9299303035